# ఏటిలోని కెరటాలు



పూజ ముగించుకుని వచ్చి భోజనం ముందు కూర్చున్నాడు రాజేంద్ర. పిల్లలిద్దరి పక్కన కంచంలో కూర చూస్తూనే-

"పొట్లకాయ కూర! అసలే వేడిచేసి యిబ్బంది పడుతుంటే ఈ కూర ఏవిటోయ్ తీసేయ్‌వోయ్" అన్నాడు భార్యామణి మాధవితో.

మాధవి చాలా చికాకుగా ఉన్నట్టుంది. కయ్‌మంది.

"అంటే మీరు తెచ్చిన కాకరకాయ వండలేదనేగా. పొరపాటే ఈ వేళ్టికి తినేయండి" చేతులు జోడించి శబ్దం వచ్చేలా!

"అరె! అడ్డంగా మాట్లాడతావేంటి? నాకు వేడిచేసి జలుబుతో బాధపడుతున్నానని తెలుసుగా!" అన్నాడు చిరాగ్గా.

అటువంటప్పుడు కాకర ఎలా తెచ్చుకున్నారూ. అదీ వేడి చేసేదేగా!" అంత చిరాకులోనూ లాజిక్‌గా అడిగింది మాధవి.

"చూడు! ఈ వేళ నేను పొట్లకాయ కూర తినను! నువ్వేమయినా అనుకో!" అతను కూర తీసి వేరే పళ్ళెంలో వేసి పులుసు పోసుకుని కలుపుకోసాగాడు.

దాంతో మాధవికి కోపం నషాళాన్నంటింది.

"యిప్పుడు ఆ కూరంతా ఎవరు తింటారు? పారేసుకోడానికి వండానా? అయినా వారం రోజుల నుంచీ చూస్తున్నాను. మీ అమ్మ, నాన్నగార్ల దగ్గరనుంచీ ఉత్తరం వచ్చినప్పటినుంచీ మీరు నాతో సరిగా కాపురమే చెయ్యడం లేదు. సెలవు వస్తే పెళ్ళాం బిడ్డలతో అలా బయటకు వెళ్దాం అన్న సరదాలు మీకేమీ ఉండవు. ఉదయం ఆరింటి నుంచీ ట్యూషన్లు, పదింటి నుంచి కాలేజీ, మళ్ళీ సాయంత్రం అయిదింట నుంచి ఎనిమిదింటి వరకూ కోచింగ్ సెంటర్ల కెళ్ళి కోచింగ్ యివ్వడం. యింటికి వచ్చి తినేసి మంచం ఎక్కి గుర్రు పెట్టడం - యింతేగా మీరు చేసేది. అందరు లెక్చరర్లూ యిలాగే చేస్తున్నారా! నా ఖర్మ కాలి మిమ్మల్ని కట్టుకున్నాను. ఆ ముందురోజు వచ్చిన రాజమండ్రి సంబంధం చేసుకోవాల్సింది." ముక్కు చీదుతూ ... ధవి.

"చేసుకోవాల్సింది యిప్పుడైతేనేం. వెళ్ళు రాజమండ్రి వెళ్లి రెండో పెళ్ళాంగా ఉంచుకుంటాడేమో కనుక్కుని సెటిల్ అయిపో!" అన్నాడు రాజేంద్ర నవ్వుతూ.

"నేనంటే మీకు వేళాకోళం అయిపోయింది. ఏది ఏమైనా సరే మీరు పొట్లకాయ కూర తినాల్సిందే!"

"నువ్వు ఎలా అనుకున్నాసరే నేను తినననే యిందాకనే చెప్పాను" స్థిరంగా అన్నాడు అతను.

"అంతే లెండి! మీ నిర్ణయాలు మీవి. ఈ జన్మకు మీరు మారరు. నాతో సంసారం చేయాలన్నా మీకు బాధే. మీకు మూడ్ వచ్చినప్పుడు నేను రెడీగా ఉండాలి. వారం రోజులు దాటిపోయిందని తెలుసుగా! రెండు కాప్సూల్స్ వేసుకోవచ్చుగా. నేను అసంతృప్తిగా ఉన్నానని తెలిసీ భార్యంటే నిర్లక్ష్యంగా చూసే భర్తని మిమ్మల్నే చూశాను."

"పిల్లల ముందు ఏమ్మాటలు అవి అసహ్యంగా!" ఇంగ్లీషులో అన్నాడు రాజేష్.

"నా మాటలన్నీ మీకు అసహ్యంగానే ఉంటాయి. పిల్లలు యింగ్లీషు మీడియంలోనే చదువుతున్నారు. మీ యింగ్లీషు ప్రజ్ఞ చూపించాల్సిన అవసరం ఏం లేదు. ఎప్పుడు మీ చుట్టూ గిరిగీసుకుని ఆ ప్రపంచంలోనే మీరు బ్రతుకుతారు. మీ మీద ఆధారపడ్డ మేం మాత్రం మీ చూపు మామీదకు ఎప్పుడు త్రిప్పుతారా అని చకోరపక్షుల్లా ఎదురుచూడాలి. అంతేగా!"

"పిల్లలముందు మనం దెబ్బలాడుకోకూడదని, వాళ్ళకి అర్థమయ్యే వయసు వస్తోందని నీకు ఎన్నోసార్లు చెప్పాను. ఛీ! ఎన్నిసార్లు చెప్పినా సిగ్గుండాలి" రాజేంద్ర కోపంగా అనేశాడు.

"అంటే నేను సిగ్గులేకుండా బరితెగించి తిరుగుతున్నాననే కదా మీ ఉద్దేశ్యం"

"నీ నోట్లో నోరు పెట్టడం నాదే పొరపాటు. నన్ను క్షమించు" పులుసు అన్నంలో చెయ్యి కడిగేసుకుని విసురుగా లేచి బట్టలు వేసుకున్నాడు రాజేంద్ర.

"అంటే నామీద కోపం అన్నంమీద చూపిస్తారన్నమాట! మీరు అన్నం మాని వెళ్ళడానికి వీల్లేదు" గుమ్మానికి అడ్డంగా నిలబడింది మాధవి.

"అభిమానం ఉన్న దానివైతే నాతో ఒక్కమాట మాట్లాడవు!" స్కూటర్ కీస్ తీసుకుని ఎవరో తరుముతున్నట్టుగా వెళ్లిపోయాడు రాజేంద్ర.

★★★

నిస్సత్తువగా సీట్లో కూలబడింది ఆఫీసుకు వచ్చిన మాధవి. సుమారు గంటన్నర క్రితం యింట్లో జరిగిన సంఘటన ఫలితంగా ఆమె మనసులోంచి లావాలాంటి ఆవేదన కన్నీటి రూపంలో స్రవిస్తూనే ఉంది. ఎందుకొచ్చిన వెధవ బ్రతుకు? ఎవరికోసం బ్రతుకుతోంది తను? పెళ్ళయి పదేళ్ళయినా మనసుకు సంతోషం, శరీరానికి సుఖమూ లేకపోయిం తర్వాత ఎవరికోసం బ్రతకాలి? యిద్దరు పిల్ల వెధవల కోసం!

అసలు దీనికంతటికీ కారణం తండ్రి. యింకో ఏభైవేలు పోస్తే ఏ యింజనీరో వచ్చేవాడు. ఆ ఏభై వేలు యిచ్చేస్తే ఒక్కగానొక్క కొడుక్కి తాను యిచ్చే ఆస్తి తగ్గిపోతుందనే పిసినారితనం, కూతురు సుఖపడిపోతుందేమోననే భయం.

ఉదయం లేచిన దగ్గర నుంచీ మొగుడికీ పిల్లలకీ సేవ. ఆఫీసుకు వచ్చినప్పటి నుంచీ బాస్‌కి ఊడిగం యిందుకేనా భగవంతుడు తనకీ స్త్రీ జన్మ యిచ్చింది? స్త్రీ వాదాన్ని సమర్థించి ఎన్నో బహుమతులు సాధించిన తన కాలేజీ చదువు యిందుకేనా? ఎందుకీ పంజరం జీవితం? జీవితం గురించి ఎన్ని కలలు కంది తను?

ఆమెకి ఉక్రోషం ఒక్కసారిగా వచ్చేసింది. బల్లమీద రెండుచేతుల మధ్య తల వాల్చి వెక్కి వెక్కి ఏడ్చింది. కాస్త రిలీఫ్ అనిపించింది.

ఎవరో వస్తున్న అలికిడై బాత్‌రూమ్‌లో దూరింది. చల్లని నీళ్ళతో ముఖం కడుక్కునే సరికి ముఖం చల్లబడినా కళ్ళల్లో మంటలు తగ్గలేదు. బేగ్‌లోంచి నేప్‌కిన్ తీసుకుని తుడుచుకుని బొట్టు పెట్టుకుంది.

సీట్లో కూర్చుంటూ పలకరింపుగా నవ్వింది. పక్కసీటు పద్మినిని చూసి.

"ఏమిటీ అలా ఉన్నావేం?"

"ఏం లేదే తలనొప్పిగా ఉంది!"

"ప్రొద్దున్నే ఏదో ప్రళయం జరిగినట్టుంది యింట్లో! నీ స్త్రీ ఆధిక్యత మీద దెబ్బ కొట్టాడా మీ ఆయన?

"హు! అలాంటి పరిస్థితే వస్తే ఆయన పురుషాహంకారాన్ని దెబ్బతీస్తానే గాని నా ఆత్మాభిమానాన్ని చంపుకోను సరేనా! నీ పని చూసుకో!" తేల్చేస్తూనే చురక అంటించింది.

పద్మిని ముఖం మాడ్చుకుని పని ఉన్నట్టు అటు తిరిగిపోయింది.

"లేకపోతే తన సంసారం గొడవదానికెందుకట? విడ్డూరం కాకపోతే! కళ్ళు కాస్త ఎర్రబడితే అంత కూపీ లాగేయాలా? తన సంసారంలో పూచిక పుల్లంత మాట పైకి రానీయదు మళ్ళీ" అనుకుంది కసిగా మాధవి.

ఎంత వద్దనుకున్నా ఆ రోజు ఒక్క పనీ సవ్యంగా చెయ్యలేకపోయింది.

భర్త లంచ్ పట్టుకెళ్ళలేదని తనూ తెచ్చుకోలేదు. నీరసంగా అనిపించడంతో తన సీట్లోనే ఉండిపోయింది మోచేతులమీద తలవంచుకుని.

★★★

కాలేజీకి వచ్చాడేగాని రాజేంద్ర మనసు మనసులో లేదు. ఈ ప్రపంచంలో డబ్బులేకపోవడం అన్నంత దరిద్రం మరొకటి ఉండదు మధ్యతరగతి వాళ్ళకి. ఉద్యోగం తప్ప మరే ఆధారం లేని తను డిగ్రీ అయినప్పటినుంచీ ట్యూషన్స్ చెబుతూనే ఉన్నాడు. ఉదయం ఆరింటికి మొదలుకొని రాత్రి ఎనిమిది గంటలవరకూ అంత కష్టపడగలిగాడు కాబట్టే తల్లితండ్రులకు యిల్లు కట్టే విషయంలోను, చెల్లెలికి కట్నం డబ్బుగాను సాయం చేయగలిగాడు. పిల్లలిద్దరూ మూడు, నాలుగులు చదువుతున్నారు. వాళ్ళ కాలేజీ చదువులకు వేలకి వేలు కావాలి. మాధవి ఉద్యోగం చేస్తుందన్న మాటేగాని సగం జీతం ఆమె చీరలు, నగలకి, పిల్లల డ్రస్సులకే సరిపోతుంది. పదిమందిలో తన పిల్లలు ఏ మాత్రం తక్కువగా కనపడ్డా అస్సలు భరించలేదు. అం... ...నంత తానుగా యిస్తే తీసుకుని ఆమె పేర్న జాగ్రత్త చేస్తాడు తప్ప తానుగా ఆమెను జీతం గురించి అడగడు. తన అదృష్టం బాగుండి మేథ్స్ లెక్చరర్ ఉద్యోగం, కష్టపడి చెబుతాడు అనే పేరు ఉండడం వల్ల ఎంత డిమాండ్ చేస్తే అంత యిచ్చి మరీ చెప్పించుకు వెళ్తారు పిల్లలు.

తానుపడే ఈ కష్టం అంతా ఎవరి కోసం? టీనేజ్ ఎంజాయ్ చెయ్యాల్సిన వయసులో కాన్వెంట్లలో పనిచేసి అమ్మ

నాన్నలకు తనకు తోచిన సాయం చేశాడు. భగవంతుడి దయవల్ల పెళ్ళయిన అయిదేళ్ళకే జె.ఎల్. గా ప్రమోషన్ వచ్చింది. వయసులో ఉన్నప్పుడే కష్టపడితే పిల్లలకు మంచి చదువులు చెప్పించడానికి వీలవుతుంది. వాళ్లు బాగుంటే తమ భవిష్యత్తంతా హేపీగా గడుస్తుంది. ఆ ఆశతోనే, ఆ ఆశయం తోనే తాను అంత కష్టపడి పనిచేస్తుంటే అర్థం చేసుకోవడం పోయి రెచ్చగొట్టే మాటలు మాట్లాడి, ఏమన్నా అంటే మరీ రెచ్చిపోయి మాట్లాడి తన మనసు పాడు చేసుకుని ఎదుటి వాళ్ళ మనసును పాడు చేసేస్తుంది మాధవి. చాలా తొందరపాటు మనస్తత్వం. కోపం వస్తే ఎదుటివారు ఎంత పెద్దవారన్నది కూడా చూసుకోదు. వూరుకున్నకొద్దీ కంఠం పెంచి అరిచేస్తుంది. అదే రీతిగా తను మాట్లాడితే "మీ మగతనం అంతా చేతల్లో చూపండి మాటల్లో కాదు" అంటుంది. పెళ్ళయి యిన్నేళ్లయినా ఆమెను ఎలా అర్థం చేసుకోవాలో, ఏ క్షణాన ఏ మూడ్‌లో ఉంటుందో తనకి నేటికీ తెలీనే లేదు.

"సార్! బెల్లయి పావుగంట అయింది. పిల్లలు బయట నిలబడి గొడవ చేస్తున్నారు సార్!" ఆటెండర్ మాటలతో అసహనంగా కణతలు నొక్కుకుంటూ క్లాస్‌కి వెళ్ళాడు రాజేంద్ర."

ఇంటర్‌వెల్‌లో పదే పదే మాధవి గుర్తు రాసాగింది. ఆఫీసుకు ఫోన్ చేద్దామా అనుకున్నాడు. మాట ఏ మాత్రం తేడాగా వచ్చినా పదిమందిలోనూ పరువుపోతుంది. ఏమైతే అయింది. ఫోన్ చేద్దాం! స్థిర నిర్ణయానికి వచ్చాడతను. సీట్లో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు.

★★★

"మాధవీ! నీకు ఫోన్" పద్మిని అందించిన రిసీవర్ అందుకుంది మాధవి.

"ఆయన దగ్గరనుంచే అయిఉంటుంది. తలబిరుసుగా మాట్లాడితే తాడో పేడో తేల్చేస్తాను" అనుకుంటున్న ఆమె "హలో! హలో!" అని నాలుగుసార్లు వినబడేసరికి ఈ లోకంలోనికి వచ్చింది.

"మాధవిగారున్నారా!"

"నేనే మాట్లాడేది!"

"మేడమ్! సార్ నిద్రమాత్రలు మింగేశారు. చాలాసేపయినట్టయింది. స్టాఫ్ అందరూ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. నాకు కాళ్ళు చేతులూ ఆడక మీకు ఫోన్ చేస్తున్నాను" అటెండర్ సాంబయ్య మాటలు వింటూనే "నో" అని అరిచింది సెక్షనంతా!

★★★

మాధవిని చూస్తూనే మతిపోయింది రాజేంద్రకి.

అతనిచుట్టూ మేథ్స్ డిపార్ట్‌మెంట్, స్టాఫ్ అంతా ఉన్నారు. యించు మించు అంతా ఆమెకి బాగా తెలిసినవారే!

మేథ్స్ హెడ్ రమణమూర్తిగారిని చూస్తూనే భర్తకోసం తెచ్చిన తన చేతిలోని లంచ్‌బాక్స్‌ని టేబుల్‌మీద పెట్టి అంది మాధవి.

"అంకుల్! మీ అబ్బాయి ఈ వేళ నామీద కోపంతో అలిగి వచ్చేశారు - భోజనం చెయ్యకుండా! పొట్లకాయకూర చేశాను. వండినదంతా ఎవరు తింటారు చెప్పండి?

అందులో కూరతోపాటు సమానంగా అన్నం పెట్టుకొని తినాలని పిల్లలకు నీతులు చెబుతారు. 'అన్నం తినకపోతే నీర్సం వస్తుంది. కరువుతీరా ఏడవాలన్నా కనీసం ఓపిక ఉండాలి కదా! అందుకని నాతో దెబ్బలాడ దల్చుకుంటే కడుపు నిండా అన్నం తిని అపుడు దెబ్బలాడు' అంటారు. మీరు చెప్పండంకుల్".

వస్తూనే తనమీద నేరాలు చెబుతూ, తన నేరం ఏమీలేనట్లు మాధవిని చూస్తుంటే అరికాలు మంట నెత్తికెక్కింది రాజేంద్రకి.

"మధూ!" మందలింపుగా అరిచాడు అంతటి చికాకులోనూ.

"మీరాగండి! అదికాదన్నయ్యగారూ! వేడి చేసింది పొట్లకాయకూర వద్దన్నారు. పోనీలే కదా పగలు, రాత్రీ మాకోసమే కదా కష్టపడుతున్నారని నేను అసలు ఆయన్ని విసిగించనన్నయ్యగారు. కనీసం వారానికోసారైనా బయటకు వెళ్లి హేపీగా గడపలేని డబ్బు సంపాదన ఎవరికోసం చెప్పండి? పెళ్లయిన కొత్తలో కష్టపడ్డారంటే అర్థం ఉంది! ఏదో భగవంతుడి దయవల్ల, ట్యూషన్స్ వల్ల, నాకు జాబ్ ఉండడం వల్లా పిల్లల చదువులకు భవిష్యత్తులో చింత పడనవసరం లేకుండా ఎవరికి వాళ్ళకు. డబ్బు ఫిక్స్‌డ్ వేసేశారు. యింకా ఎవరికోసం చెప్పండి ఈ తాపత్రయం? ఆయనకు బయట ఏది తిన్నా పడదు. ఒక సిగరెట్టు, మందూ, పేకాట అలాంటి అలవాట్లు మచ్చుకైనా లేవు. యిల్లు కాలేజీ తప్ప యింకో ప్రపంచమే తెలియదాయనకు. నా మీద అలిగి అన్నం మానేస్తే ఆయనకు ఏదైనా అయితే మాకు దిక్కెవరు చెప్పండి. యింతకీ యిదంతా యీ దిక్కుమాలిన పొట్లకాయ కూర గురించి. మీ యింట్లో మీరు మా వదినగార్ని యిలాగే యిబ్బంది పెడుతున్నారా! మీరైనా చెప్పండి అన్నయ్యగారూ! "మరో జె.ఎల్. సుబ్రహ్మణ్యంతో నాన్‌స్టాప్‌గా అంటుంటే యింక ఆగలేకపోయాడు రాజేంద్ర."

"యింట్లోనే కాక కాలేజీకి వచ్చి అందరిముందూ నా పరువు తీస్తావా! యూ బ్లడీ రాస్కెల్!" అంటూ ఆమె తెచ్చిన బాక్స్ బయటకు విసిరేసి మాధవిని పదిమంది ఉన్నారని చూడకుండా బలమంతా ఉపయోగించి లాగికొట్టాడు. అప్పటికే అతని ఆవేశం గమనిస్తున్న రమణమూర్తిగారు, సుబ్రహ్మణ్యంగారు, అటెండర్ సాంబయ్య అడ్డుకోబోయినా జరగవలసింది జరిగేపోయింది. మాధవి స్పృహ తప్పి పడిపోయింది.

★★★

"ఏయ్ మధూ! ఏమిటే ఏమైంది అంతలా అరిచావ్? మెలకువ వచ్చిందా! మెలకువ తెచ్చుకోవే! నువు మన ఆఫీసులోనే నీ సీట్లోనే ఉన్నావ్!" ఆత్రుతగా భుజం పట్టి వీపు తడుముతూ అంటున్న పద్మనిని వింతగా చూసింది మాధవి. తన చేతుల్లో ఫోన్ రిసీవర్ లేదు. ఫోన్ దూరంగా మామూలుగానే ఉంది.... తన సీటు చుట్టూ సెక్షన్ స్టాఫ్ అంతా చేరి వింతగా చూస్తున్నారు.

"ఆయనకి యాక్సిడెంట్ అని ఫోన్..."

"నీ మొహం! రెండయినా లేనకపోతే అందరూ కంగారుపడుతుంటే 'దానికీవేళ ఒంట్లో బాగుండలేదు. బాగా నీర్సంగా ఉంది. లేపొద్దు' అని నేనే చెప్పాను యింద! యీ కాఫీ తాగు. కాస్త ఓపిక వస్తుంది. ఈ వేళ సెక్షన్ ఆఫీసర్ సెలవు పెట్టడం నీ అదృష్టమే అనుకో!" పద్మిని ఆప్యాయంగా తన ఫ్లాస్కులో కాఫీ అందిస్తుంటే ఆమె చేయి సున్నితంగా నొక్కి నవ్వుతూ "యింత చిన్న నిద్రలో అంత పెద్ద కలా!" మాధవి అనుకుంది.

"నీర్సంగా ఉంటే పోనీ పర్మిషన్ పెట్టి వెళ్ళిపోవే!" తను తాగిన కాఫీ గ్లాసు అందుకుంటూ పద్మిని యిచ్చిన సలహాకి కృతజ్ఞతగా చూసింది మాధవి.

"ఫర్వాలేదే! అప్పుడే మూడయింది. యింకో రెండు గంటల్లో ఎలాగూ వెళ్ళిపోతాం. యింక పడుకొని మిమ్మల్ని యిబ్బంది పెట్టనులే. అందరికి థాంక్స్" అంటూ నెమ్మదిగా ఫైల్లో తలదూర్చింది మాధవి.

★★★

"నో! మధూ! అయామ్ సారీ మధూ! అయాం వెరీ సారీ!" ఒక్కసారి రాజేంద్ర అరచిన అరుపుకి ఉలిక్కిపడ్డారు రమణమూర్తిగారు. సాంబయ్య కుండలోని చల్లని నీళ్ళు తీసుకువచ్చి "ఏంటయ్యగారూ అంత అరుపు అరిచారు? ఒంట్లో బాగుండలేదా? ముందు ఈ మంచినీళ్ళు తాగండి" అంటూ అందించాడు.

రాజేంద్ర కళ్ళు గట్టిగా నులుము కున్నాడు. గబగబా నీళ్ళు తాగేశాడు.

తను డిపార్ట్‌మెంట్‌లో తన సీట్లోనే ఉన్నాడు.

అంటే మాధవి రావడం గొడవ చెయ్యడం అంతా... అంతా పగటికలా!

"ఏంటయ్యా రాజా! అమ్మాయితో ఏమైనా ప్రాబ్లమ్ వచ్చిందా! అంత అరుపు అరిచావు! ఒక్కసారిగా నా బి.పి. రెండూ యిరవైకి చేరిందనుకో. యిల్లుదాటి బయటకు వచ్చేసాకా ఈ ప్రపంచంలో పడిపోవాలయ్యా. మరీ అంత సున్నితమైన మనసైతే ఎలా? నేను చూడు. మీ పిన్నిగార్ని ఎదురుగా ఉన్నా పట్టించుకోను. అలా అని తీసిపడెయ్యనూ! భార్యగా మీద ఎంత ప్రేమ ఉండాలో అంతే ఉండాలి. "అతి సర్వత్ర వర్జయేత్!" అన్నారు పెద్దలు" అన్నారు రమణమూర్తిగారు నవ్వుతూ.

"నిజమే తమ్ముడూ!" నా మటుకు నాకు హార్ట్‌బీటింగ్ వంద దాటిపోయింది మరి! భార్యాభర్తల మధ్య గొడవలు, దెబ్బ లాటలూ అనేవి ఏటిలోని కెరటాల్లాంటివి. ఆ అలల తాకిడికి సంసారం ఒక్కక్షణం ఒడుదుడుకులకు లోనైనా ఆ కెరటాలు తీరాన్ని తాకి తిరిగి ఏటిలోకే చేరతాయి. అలాగే భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలు కూడా! నువు మరీ బిజీ అయిపోవడంపట్ల నీ భార్య అతిగా బాధపడుతోంది నీ గురించి! నీ ఆర్థిక పరిస్థితులవల్ల నువు నీ భార్యను సుఖపెట్టలేకపోతున్నానే అని డిప్రెషన్‌కి లోనవుతున్నావు! నా మాటవిని ఓ వారంరోజులు సెలవుపెట్టి ఏ పెద్ద తిరుపతో, మీకు నచ్చిన చోటుకో వెళ్ళి తిరిగిరండి. శారీరక శ్రమకు తగినంత మానసిక విశ్రాంతి

లేకపోవడం వల్లనే కుటుంబంలో అశాంతి రగులుతోంది. మీ కోసం మీరు బ్రతకండి. బీ హేపీ ఆల్వేస్!" అన్నాడు జె.ఎల్. సుబ్రహ్మణ్యం భావగర్భితమైన మాటలతో.

★★★

సాయంత్రం యింట్లోకి మల్లెపూలతో అడుగుపెట్టిన రాజేంద్రకు ఆఫీసు నుంచి వచ్చి కడిగిన ముత్యంలా తయారై పిల్లలచేత హోం వర్కు చేయిస్తున్న మాధవిని చూసేసరికి హృదయం ఆమె పట్ల ప్రేమానురాగాలతో పెల్లుబికిపోయింది. అయినా అది కనపడనీయకుండా గబగబా బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు మాధవికేసి చూసి పలకరింపుగా నవ్వి!"

మంచినీళ్ళ గ్లాసుతో బెడ్‌రూమ్‌లోకి వచ్చిన మాధవి అతనికి గ్లాసు అందించి అంది.

"వచ్చారా! మిమ్మల్ని... మిమ్మల్ని మళ్ళీ చూస్తాననుకోలేదు" బేలగా!

అతను గ్లాసు ఆమెకు అందించి 'నేను కూడా" అన్నాడు మాధవి గ్లాసు టీపాయ్ మీద పెట్టి "ఏమండీ!" అంటూ అతన్ని అల్లుకుపోయి వెక్కి వెక్కి ఏడవసాగింది.

"మధూ! తప్పు! నువ్వు కన్నీళ్ళు పెట్టడం నా కిష్టం ఉండదు. నీకు తెలుసు. అకారణంగా యిలా ఏడవచ్చా తప్పు కదూ!" అన్నాడామె వీపుమీద చెయివేసి నిమురుతూ

"అది కాదండీ! నాకైతే ఎంత భయం వేసిందనుకున్నారు? మీకు నిద్రమాత్రలు మింగి నట్టు పగటికలకని కెవ్వున అరిచేసరికి ఆఫీసులో అందరూ దడదడలాడి పోయా రనుకోండి. నా మొహం మండ! అనవస రంగా ఒక మాటకు పది అని మిమ్మల్ని అన్నం తినకుండా చేశాను. పాపిష్టిదాన్ని!"

"నువు ఏదో మాట్లాడటం మొదలుపెట్టి తలాతోకా లేకుండా మరెక్కడికో వెళ్ళి పోతుంటే, నీ ప్రశ్నలకు సమాధానం చెబితే ఒక తంటా! చెప్పకపోతే మరో తంటా అన్నట్టయింది నా పరిస్థితి. నాకు నిజంగా ఒంట్లో బాగుండలేదని తెలిసీ నువు మొండిపట్టు పట్టేసరికి నాకు చాలా బాధేసింది సుమా! యిన్నేళ్ళ కాపురంలో అన్నంలో చేయి కడగడం ఏనాడైనా చూశావా నువు. 'అన్నం పరబ్రహ్మస్వరూపం'గా భావించే నేనే అలా ప్రవర్తించానంటే ఎంత బాధపడితే ఆ పని చేశానో నీకు తెలుసు. 'భోజనం చేసేటప్పుడు మాట్లాడకుండా తినాలి' అని మా అమ్మ అస్తమానూ మమ్మల్ని మందలించేది. యిందుకే కాబోలు. నేనెంత భయపడ్డానో తెలుసా! నా మనసు మనసులో లేదు. నువు మీ యింటికి పిల్లల్ని తీసుకుని వెళ్ళిపోతావనుకున్నాను" అన్నాడు రాజేంద్ర నవ్వుతూ.

ఆమె అతని చెయ్యిపట్టుకుని కాట్‌పై కూర్చోపెట్టి, తనూ కూర్చుంది.

"ఊ యింకా!" ఉత్సాహంగా అడిగింది మాధవి.

"మీ అమ్మా నాన్నకి ఫోన్‌చేస్తే నేను యింటికి వచ్చేసరికి అందరూ కలిసి పెద్ద యుద్ధం ప్రకటిస్తారని మరో ఊహ! ఆవేశంలో ఏ కిరసనాయిల్లో మీద పోసుకుని అంటించేసుకుంటే, పిల్లలు వెక్కి వెక్కి ఏడుస్తుంటే చుట్టుపక్కల వాళ్ళు పోలీస్ రిపోర్ట్ యిచ్చినట్టు, "వాళ్ళు నన్ను అరెస్ట్ చేసినట్టు, పిల్లలు అనాథలైనట్టూ."

"ఆ! యింకా!" ఆమె కళ్ళు ఎగరేస్తూ అంది.

"నువ్వు బాక్స్ పుచ్చుకుని డైరెక్టుగా కాలేజీకి వచ్చి రమణమూర్తి అంకుల్‌తోటి, సుబ్రహ్మణ్యంతోటి మన విషయాలన్నీ చెప్పేస్తుంటే నిన్ను లాగి లెంపకాయ కొట్టానట. నువు స్పృహ తప్పినట్టు నేను పగటికల కని అరిచిన అరుపుకి డిపార్ట్‌మెంట్‌లో అందరూ హడలిపోయారంటే నమ్ము!"

"ఏది ఏమైనా నా ఆలోచనల నిండా మీరు, మీ ఆలోచనల నిండా నేను ఉన్నామంటే మన యిద్దరికీ ఒకరిమీద ఒకరికి సంపూర్ణమైన అనురాగం, పరిపూర్ణమైన నమ్మకం ఉన్నాయి. మన వృత్తుల్లోకి వెళ్ళినా మనం అక్కడ యిమడలేక పోయామంటే అర్థం అదే కదా! అంచేత నా మాటమీద గౌరవం ఉంచి ఒక్కపనిచేసి పెట్టండి. ఆదివారం ఎక్కడికైనా తిరిగి వద్దాం! ఊళ్ళో పార్కులు అవీలేకపోయినా కనీసం గుడికైనా ఖచ్చితంగా వెళ్ళి వద్దాం. లేదా ఏమీ కొనుక్కోకపోయినా అలా బజారుకు ఈవెనింగ్ వాక్‌లా వెళ్ళొద్దాం. పదిహేనేళ్ళుగా మరలు అరిగిన యంత్రంలా మీరు పనిచేస్తూనే ఉన్నారు. భగవంతుడి దయవల్ల మనకు ఈ వేళ ఆర్థికపరమైన యిబ్బందులు లేవు. ఒక్కనాడూ మీరు సుఖసంతోషాలతో గడిపిన రోజు నేను చూడలేదు. మీరు ఆనందంగా ఉంటేనే నాకూ మనసుకు సంతోషంగా ఉంటుంది సరేనా ఎట్‌లీస్ట్ ఆన్ హాలిడే! ఓకే!"

ఆమె చేతుల్ని తన భుజంమీద వేసుకుని ఆమె నడుంచుట్టూ చేతులు వేస్తూ అన్నాడు రాజేంద్ర.

"సరే సుధా. నీ యిష్టమే నా యిష్టం. యిక పిల్లలకు గాని, నీకుగాని మనస్తాపం కలిగించే ఏ పనీ చెయ్యనని మాట యిస్తున్నాను. అందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకుని మీతో ఎక్కువ సమయం గడపడానికి ప్రయత్నిస్తాను."

ఆమె అతని బుగ్గ సున్నితంగా కొరికి "వెళ్ళి స్నానం చేసి రండి! మీరింకా నా గురించేమనుకున్నారో! మీ గురించి నేను ఏమనుకున్నానో అన్నీ బోలెడు విషయాలు మాట్లాడుకోవాలి. పిల్లల్ని తొందరగా భోజనం పెట్టి పడుకోబెట్టేస్తాను సరేనా!" అంది హాయిగా స్వచ్ఛంగా నవ్వుతూ.

అతను డ్రస్ మార్చుకుని స్నానానికి వెళ్ళాడు.

మాధవి యింటి నిండా ప్రతీ గదిలోనూ యింటా బయట అన్నిలైట్లు వేసేసింది. ఆమె మనసులో ఉప్పొంగుతున్న ఆనందం తమలో ప్రతిబింబిస్తున్నట్లుగా దీపాలు మరింత కాంతివంతంగా వెలుగుతూ అనంతమైన సంతోషంతో వారి యిల్లు ప్రకాశిస్తున్నట్లుగా ఉంది! ●

'మయూరి సచిత్ర వారపత్రిక'
05-01-2001